


# శుభాకరం

జి.ఎస్.వి. సత్యనారాయణ

**నాగార్జున ఎక్స్‌ప్రెస్ గుంటూరు చేరేసరికి మధ్యాహ్నం ఒంటిగంట. బండి దిగి ప్లాట్‌ఫారం మీద వెయిటింగ్. మా అక్కయ్య కూతురి పెళ్ళి. రాత్రి రెండు గంటలకు. అక్కయ్యంటే పెదనాన్న గారి అమ్మాయి.**

మా పవన్‌గాడు స్టేషన్‌కి వస్తానన్నాడు. పవన్ అంటే మా అక్కయ్య కొడుకు. డిగ్రీ వెలగబెడుతున్నాడు. నేనంటే అభిమానం వాడికి. పెళ్ళి పనులలో బిజీగా ఎక్కడ వున్నాడో అనుకున్నంతలో... హలో మామయ్యా అంటూ వచ్చాడు పవన్. రెండేళ్ళు దాటింది వాణ్ణి చూసి. మరికాస్త పొడుగు... లావు అయ్యాడు. వీణ్ణేనా చిన్నప్పుడు ఎత్తుకుని మోసింది అనుకున్నాను. వాడి వెనకాల నలుగురు ఫ్రెండ్స్.

''ఏరా పవన్ బాగున్నావా?'' అడిగాను.

''ఆ! బాగున్నాను. ఏం మావయ్యా... అత్తయ్యను పిల్లలను వదిలిపెట్టి పెళ్ళికి నువ్వొక్కడివే రావడం బాగులేదు'' అన్నాడు.

'ఏం చేస్తాంరా.. వీలవలేదు. పిల్లలిద్దరికీ పరీక్షలు''

సరేలే మావయ్యా.. ఇదిగో వీడు శేఖర్, వాడు రాజ్.. కల్యాణ్.. శరత్.. హలో.. హలో.. అనుకున్నాం అందరం.

''మావయ్యా.. ఈ కల్యాణ్‌గాడు నిన్న ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాడు. మేం వేరే పనులలో బిజీగా వున్నాం. ఏమనుకోకు..'' అన్నాడు.

''అనుకునేదేముందిరా.. పెళ్ళంటే బోల్డు పనులు.. నీ పనుల్లో నువ్వుండు'' అన్నాను.

ఇంటికి చేరుకున్నాం. అక్కయ్యతోనూ, బావతోనూ మాట్లాడి పెళ్ళికూతురి దగ్గర కాసేపు కూర్చుని పలకరించాను. ఆపై చుట్టాలు. అందరూ నీరజను, పిల్లలను తీసుకురానందుకు నిష్టూరమాడారు.

మధ్యాహ్నం భోజనాలు కల్యాణ మండపం దగ్గరే అన్నారు. అందరం మేరేజ్ హాల్ చేరుకున్నాం. భోంచేస్తుంటే ''మామయ్యా .. పైన మా ఫ్రెండ్స్‌కని రూమ్ అట్టేపెట్టా... జర్నీ చేసి వచ్చావ్... కాసేపు రెస్ట్ తీసుకుందువుగాని..'' అంటూ వచ్చాడు పవన్.

ఆ రూమ్‌లో పవన్‌గాడి ఫ్రెండ్స్ పదిమంది వరకూ వున్నారు. అందరికీ పరిచయం చేశాడు. ఓ మూలగా వున్న మంచం మీద మేను వాల్చాను. అంతా గోలగోలగా వుంది. ఈ పవన్‌గాడికి మొదటినుంచి ఫ్రెండ్స్ ఎక్కువ. మూడేళ్ళ క్రితం అక్కయ్య వాళ్ళ గృహప్రవేశానికి వచ్చాను. బావ తరపున వాళ్ళ ఆఫీస్ కొలీగ్స్, ఫ్రెండ్స్ అందరూ కలిపి పట్టుమని పాతికమంది వస్తే ఈ పవన్ ఫ్రెండ్స్ యాభైమంది వచ్చారు. అప్పట్లో అదో పెద్ద సంచలనమే అయింది. అదిచూసి మా బావ నొచ్చుకుని ఇంతకూ గృహప్రవేశం నాదా.. వాడిదా అని అడిగాడు. పైకి ఎన్నన్నా.. ఇల్లు మొదలుపెట్టిందగ్గర్నుంచీ... కాటరింగ్ వరకూ ... చాలావరకు ఖర్చులు. బోల్డంత మేన్ పవరూ అన్నీ కలిసొచ్చాయన్నది మాత్రం నిజం.

సాయంత్రం అయిదయింది.

మా పవన్‌గాడు ఎవడో బాబ్జీగాడట... వాళ్లందరూ లడ్డూ అని పిలుస్తారట. లావుగా బొద్దుగా వున్నాడు. వాడిచేత ఓ లడ్డూ రెండు బజ్జీలు పంపాడు. 'సారీ అంకుల్.. రెండు లడ్డూలు ఇచ్చారుగానీ ఆకలేసి ఒకటి తినేశాను' అన్నాడు మరో లడ్డూ వంక ఆబగా చూస్తూ .. అది కూడా మిగిల్చేలా లేడని గబుక్కున ప్లేటు లాక్కున్నాను.

తర్వాత కాఫీ వచ్చింది.

కాస్త రిఫ్రెష్ అయి కల్యాణ మండపంలోకి వచ్చాను. అక్కయ్య కూతురి పెళ్ళి... ఏ పని అందు కుందామన్నా... అక్కడ పవన్ ఫ్రెండ్స్ వుంటు న్నారు.

'ఏంది బావా.. మొత్తానికి పవన్‌కి మంచి పేరే పెట్టావు. అలనాడు రాముడికి వానరసేన సహాయం చేసినట్టు ఈ పెళ్ళి ఏర్పాట్లలో ఎక్కడ చూసినా పవన్‌గాడి సేన వుంటున్నారు. పనులన్నీ చకచకా జరిగిపోతున్నట్లున్నాయి..' అన్నాను.

'అవును.. నిజం' అన్నాడు మా బావ.

రాత్రి భోజనం కానిచ్చి ఆ పెళ్ళి మండపంలోనే ఓ మూలగా కుర్చీలో కూర్చుని జోగుతున్నాను. అర్ధరాత్రి ముహూర్తం అంటే కొన్ని పాట్లు తప్పవు.

'ఏం మావయ్యా. భోజనం అయింది కదా..' అంటూ వచ్చాడు పవన్ దగ్గరలోని కుర్చీని లాక్కుంటూ.

'అయిందిరా...'

'సారీ మావయ్యా.. నీతో మాట్లాడడానికే కుదర డంలేదు. పెళ్ళి పనులు.. వాటికితోడు సాయంత్రం ఓ ఇన్సిడెంట్..'

'ఏమయింది'

''శుభాకరం... అని మా ఫ్రెండ్. మన పెళ్ళికనే బయలుదేరాడు. ఈలోగా వాళ్ళ బాబాయికి ఒంట్లో బాగులేదని ఫోన్... అక్కడికి వెళుతుండగా యాక్సిడెంట్. బైక్ డివైడర్‌కి కొట్టుకుని బాలన్స్ తప్పి పడ్డాడు. ఇక్కడే ... ఐసియులో వున్నాడు. దెబ్బలు బాగా తగిలాయి...'' వాడి కళ్ళలో చిప్పి ల్లిన నీళ్ళు.

''అయ్యో.. అలాగా...'' అన్నాను.

''ఏదో ఈ పెళ్ళి పనులన్నీ అన్యమనస్కంగా చేస్తున్నాం. కానీ మా మనసులన్నీ అక్కడే వున్నాయి. ఏ కబురు వినాల్సి వస్తుందోనని..'' కళ్ళు తుడుచుకున్నాడు.

''ఊరుకోరా... నీకు ఫ్రెండ్స్ అంటే ఎంత అభి మానమో నాకు తెలుసు. అతనికి ఏం కాదులే'' ఊరడింపుగా అన్నాను.

అదే మామయ్యా... అందరం కోరుకుం టున్నాం. ఆపై భగవంతుడి దయ. వాణ్ని పాపం చాలా పేర్లు పెట్టి ఏడిపించేవాళ్ళం. కాపర్ హాండనీ.. అశుభాకరం...

'అశుభాకరమా..'

అవును. వాడిపేరు శుభాకరం. కాని వాడి 'కరం' అలాంటిది. ఏదైనా పని కాకూడదు అను కుంటే మా శుభాకరం 'కరం'తో కరచాలనం చేస్తే చాలు, ఇక ఆ పని కాదు.

'అలాగా..'

''ఆర్నెల్ల క్రితం మా ఫ్రెండ్ రమణగాడి రూమ్మే ట్‌గా మొదటిసారి పరిచయమయ్యాడు. అందరం కబుర్లు చెప్పుకుంటున్నాం. ఈలోగా 'చీకటి పడ బోతుంది... లైట్లు వేద్దాం' అంటూ ఆ శుభాకరమే స్విచ్ వేశాడు. ఒక్కసారిగా వెలిగిన బల్బ్ మరలా వెంటనే ఆరిపోయింది. అంతే.. తర్వాత రాష్ట్రం అంతా కరెంటు మొహం చూడ్డానికి మూడు రోజులు పట్టింది''.

'.....'

కొత్తగూడెం పవర్‌స్టేషన్‌లో మూడు యూని ట్లు, సింహాద్రిలో రెండూ పనిచేయడం మానేశా యట సాంకేతిక కారణాల్తో. అలా మొదటిసారి వాడి పవర్ బయటపడింది. ఆ తరువాత మా రాంబాబుగాడు ఆర్నెల్ల నుంచి ప్రేమిస్తున్న ప్రసన్న ఏడోనెల్లో నవ్విందని ఓ ప్రేమలేఖ తయారుచేసు కుని ఇవ్వడానికి వెళుతుంటే శుభాకరం అడ్డొచ్చి, షేక్‌హాండిచ్చి ఆల్ ది బెస్ట్ చెప్పాడు. అంతే... ఏమ యిందో కాని ప్రేమలేఖని చూసిన ప్రసన్న అగ్గిమీద గుగ్గిలమే అయిపోయి ప్రిన్సిపాల్‌కి చెప్పి నానార భస చేసింది. అలా అప్పటినుంచీ వాడితో షేక్ హాండ్ తీసుకోవాలంటే ఎవడైనా షేక్ అవ్వా ల్సిందే.

'నిజంగానా!''

అవును. మరోసారి ఆ శుభాకరం రన్నింగ్‌లో బస్సెక్కుతుంటే చూసిన మా ఫ్రెండ్ దాసుగాడు బస్సులోంచి చెయ్యందిచ్చాడు. అంతే... ఏకంగా బస్ రాడ్ వెల్డింగ్ ఊడొచ్చి దాసుగాడు బస్సు లోంచి జారి పడ్డాడు. నీకు చెప్పినవన్నీ మచ్చుకే అనుకో... చాలా వున్నాయి. అందరం బాగా ఏడి పించేవాళ్లాం. అయినా శుభాకరం నొచ్చుకునేవాడు

> మరోసారి ఆ శుభాకరం రన్నింగ్‌లో బస్సెక్కుతుంటే చూసిన మా ఫ్రెండ్ దాసు గాడు బస్సులోంచి చెయ్యం దిచ్చాడు. అంతే... ఏకంగా బస్ రాడ్ వెల్డింగ్ ఊడొచ్చి దాసుగాడు బస్సులోంచి జారి పడ్డాడు.

కాడు పాపం... మంచాడే. నలుగురికి సహాయం చేయాలనుకుంటాడు. ఇప్పుడిలా జరగడంతో అందరం బాధపడ్తున్నాం.

ఈలోగా ఒరేయ్ పవన్ అంటూ వాళ్ళమ్మ పిల వడంతో మళ్ళీ వస్తానంటూ వెళ్ళాడు పవన్.

సినిమాల్లో ఐరన్‌లెగ్ శాస్త్రిని బ్రహ్మానందం నానాతిట్లు తిట్టి తన్నుతుంటే నవ్వుకుంటుంటాం. కాని రియల్ లైఫ్‌లో ఐరన్‌లెగ్ అనో కాపర్ హాండనో ఒక్కసారి పేరు పడితే జరిగే సంఘట నలు కాకతాళీయాలే అయినా యాదృచ్ఛికాలే అయినా... రెండు మూడు వరసగా జరిగాయంటే అంతే యిక.

టైమ్ ఒంటిగంట కావస్తోంది.

పెళ్ళి మండపం మీద హడావుడి ప్రారంభ మైంది.

పెళ్ళిళ్ళు చూసి చాలా రోజులయింది. ఆసాంతం వీక్షిద్దాం అనుకుని ముందు వరుసలో కూర్చు న్నాను. జనం పల్చబడ్డారు.

చెప్పొద్దూ... మా అక్కయ్య కూతురు కుందనపు బొమ్మలా వుంటుంది. పెళ్ళికొడుకు బానే వున్నాడు. జోడీ కుదిరింది అనుకున్నాను.

ఈలోగా ఎక్కడినుంచి వచ్చారో ఇద్దరు వీడి యోగ్రాఫర్లు, నలుగురు ఫొటోగ్రాఫర్లు పెళ్ళిమం డపం చుట్టూ పొజిషన్లు తీసుకున్నారు. అంతే యిక... పెళ్ళికూతురు పెళ్ళికొడుకు పెళ్ళయిన దాకా కనబడితే ఒట్టు... కేవలం వీడియోకోసం, ఫోటోలకోసం జరుగుతుందా పెళ్ళి అనిపిస్తోంది.

పెళ్ళయిపోయింది. పెళ్ళికి అటెండెన్స్ వేయిం చుకున్నట్లయింది నా పరిస్థితి.

హైదరాబాదుకి ఒంటిగంటకు ట్రైనుందంటే భోంచేసి అందరికీ వీడ్కోలు చెప్పి బయలుదేరాను. నేను స్టేషన్ దగ్గర దింపుతానులే మావయ్యా అని పవన్‌గాడు అనడంతో వాడి బైక్‌మీద ఎక్కి కూర్చు న్నాను. మా అక్కయ్య పిల్లలు తింటారంటూ స్వీట్ల కవరందించింది.

దారిలో.. 'ఇదీ మామయ్యా శుభాకరాన్ని జాయిన్ చేసిన హాస్పిటల్. ట్రైన్‌కి ఇంకా టైముంది. ఒకసారి చూసి వెళ్ళిపోదామా' అన్నాడు.

'ఓ తప్పకుండా' అన్నాను.

మేం వెళ్ళేసరికి ఎవరో పెద్ద డాక్టరట – శుభాక రాన్ని పరీక్షిస్తున్నాడు. అద్దాల్లోంచి అంతా కనిపి స్తుంది. పాపం తెల్లటి బాండేజితో శరీరం అంతా 'పేకింగ్ చేసినట్లుగా వుంది. కళ్ళు మాత్రం కనిపిస్తు న్నాయి. చూస్తున్నాడు. ఆ పెద్ద డాక్టరుగారు శుభా కరం చెయ్యి పట్టుకుని ఏదో చెప్తున్నాడు. పవన్ ఫ్రెండ్స్ నలుగురయిదుగురు వున్నారు.

'మావయ్యా నువ్విక్కడే వుండు. నే వెళ్ళి కను క్కుని వస్తాను' అంటూ పవన్ లోపలికి వెళ్లాడు.

అయిదు నిముషాల తరువాత వచ్చాడు. వాడి ముఖంలో విషాదచ్ఛాయలు

'మావయ్యా, పాపం శుభాకరం రెండు రోజుల కంటే ఎక్కువ బతకడం కష్టమని డాక్టరు చెప్పా రట...' వాడి కళ్ళమ్మట నీళ్ళు. భుజం తట్టి ఓదా ర్చాను.

మౌనంగా ఇద్దరం స్టేషన్‌కు చేరుకున్నాం.

పవన్ చాలా డీలాపడిపోయాడు. వాడికి ధైర్యం చెప్పి నేనూ విషాద వదనంతో ట్రైనెక్కాను – పవ న్‌కి టాటా చెప్తూ.

మూడు రోజులు గడిచాయి.

ఆఫీస్... ఇతర పనుల బిజీలో పవన్‌కి ఫోన్ చేయడం కుదరలేదు. కాస్త తీరిక దొరకడంతో ఫోన్ చేశాను అక్కయ్య వాళ్ళింటికి. పవనే ఎత్తాడు.

'ఆ! మావయ్యా బాగున్నావా... అందరం బాగానే వున్నాం..' హుషారుగా మాట్లాడుతు న్నాడు.

'ఒరేయ్ పవన్, నీ ఫ్రెండ్... శుభా... కరం..' అన్నాను.

'ఆ! వాడికేం... బానే వున్నాడు...'

'అమ్మయ్య' రిలాక్సయ్యాను.

'గండం గడిచినట్లే కదా..'

'ఆ... వాడికి గడిచినట్లే... కాకపోతే ఆరోజు శుభాకరం... కరం పట్టుకుని రెండు రోజుల్లో పోతా డని చెప్పారే పెద్ద డాక్టరుగారు... 'అవునవును..'

'ఆ డాక్టరుగారు.. పాపం సడన్‌గా పోయా రట... నిన్ననే...' ■